క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో చండీ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం పౌర్ణమి సందర్భంగా అగస్త్యేశ్వరస్వామికి రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చన చేసి ప్రత్యేకంగా అలంకరించారు. లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, రుద్ర, చండీ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. కార్యక్రమంలో ఈఓ వెంకటసుబ్బయ్య, అర్చకులు, భక్తుల పాల్గొన్నారు.

ఆలయాలు మూత

ప్రొద్దుటూరు కల్చరల్ : చంద్రగ్రహణం సందర్భంగా పట్టణంలోని ఆలయాలు మూతపడ్డాయి. అగస్త్యేశ్వరస్వామి, ముక్తిరామలింగేశ్వరస్వామి, రతనాల వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి తదితర ఆలయాలు చంద్రగ్రహణం సందర్భంగా మధ్యాహ్నం నుంచి ఆలయాలను అర్చకులు మూసివేశారు. సోమవారం ఆలయ శుద్ధి, పుణ్యహవాచనం, నివేదన, పూజా కార్యక్రమాల తర్వాత భక్తులకు స్వామివారి దర్శనం కల్పించనున్నారు.

రాజుపాళెం : చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వెల్లాలలోని శ్రీచెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వర, నరసింహ స్వాముల ఆలయాలను ఆదివారం మధ్యాహ్నం మూసివేసినట్లు ఆలయ అర్చకులు శేషాచార్యులు, పవన్, సురేంద్ర, చలపతి తెలిపారు. తిరిగి సోమవారం తెల్లవారుజామున సంప్రోక్షణ చేసి ఆలయాలను తెరుస్తామని వారు పేర్కొన్నారు. ఇందులో భాగంగా పుణ్యహవచనం, ఆలయ శుద్ధి, స్వామివారికి అభిషేకం, పూజలు చేస్తామని చెప్పారు. అనంతరం భక్తులు స్వాములను దర్శించుకోవచ్చునని తెలిపారు.

అన్నదానం

ప్రొద్దుటూరు : స్థానిక వీరబ్రహ్మేంద్రస్వామి వృద్ధాశ్రమంలో ఆదివారం న్యాయవాది సుమంత్ కుమార్ తన పుట్టిన రోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. స్వయంగా ఆయన వృద్ధులకు భోజనం వడ్డించారు. ప్రతి ఒక్కరూ వృద్ధులను గౌరవించాలని, తోచిన సహాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది బాలాజీ, వృద్ధాశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

నర్తనశాల పుస్తకావిష్కరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణానికి చెందిన కవి, ఓఎస్డీ డాక్టర్ ఎం.ప్రభాకర్ రచించిన నర్తన శాల పుస్తకాన్ని ఆదివారం గుంటూరులోని జిల్లా పరిషత్ మీటింగ్ హాల్‌లో నాయీ బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్ అభినందన సభలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ నర్తన శాల పుస్తకంలో శివుడి నృత్యంలో భాగమైన లాస్యం, తాండవం, నృత్యం, ఆలయ నర్తకీమణుల గురించి, దేవదాశీల గురించి వివరించినట్లు తెలిపారు.

జూదరుల అరెస్టు

మైదుకూరు : మైదుకూరు మండలం నల్లమల్ల అటవీ ప్రాంతంలోని భైరవకోనలో శనివారం అర్ధరాత్రి పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి రూ.లక్షా 57 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్లు అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. కచ్చితమైన సమాచారం మేరకు డీఎస్పీ రాజేంద్రప్రసాద్ ఆదేశాలతో అర్బన్ ఎస్ఐ చిరంజీవి తన సిబ్బందితో కలిసి దాడి చేసినట్లు సీఐ పేర్కొన్నారు. ఇందులో పేకాట ఆడుతున్న 10 మంది దొరకగా మరో 8 మంది పరారైనట్లు వివరించారు. పారిపోయిన 8 మందిపై కూడా కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ప్రతి శనివారం రాత్రి భైరవకోనలో నిద్ర చేయడానికి వచ్చే వారు దైవ సంబంధిత కార్యక్రమాలలో మాత్రమే పాల్గొనాలని, అసాంఘిక కార్యక్రమాల్లో ఎవరు పాల్గొన్నా వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ రమణారెడ్డి హెచ్చరించారు.

నేడు పుల్లారెడ్డిపల్లెలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు

కలసపాడు : మండలంలోని పుల్లారెడ్డిపల్లె గ్రామంలో మేరీమాత ఉత్సవాల సందర్భంగా సోమవారం నుండి జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పుల్లారెడ్డిపల్లె యూత్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వాలీబాల్ పట్ల ఆసక్తి ఉన్న జట్లు పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.10 వేలు, రెండవ బహుమతి రూ.5 వేలు, మూడవ బహుమతి రూ.3 వేలు అందజేస్తామన్నారు. టోర్నమెంట్‌లో పాల్గొనే జట్లు రూ.300లు ఎంట్రీఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

నివాళి

కలసపాడు : మండలంలోని హృదయపేట గ్రామానికి చెందిన లింగారెడ్డిపల్లె ఎంపీటీసీ సభ్యులు సగిలి రమేష్ తండ్రి సగిలి బాలశౌరి శనివారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ బద్వేలు నియోజకవర్గ అదనపు సమన్వయకర్త నల్లేరువిశ్వనాథరెడ్డి ఆదివారం బాలశౌరి మృతదేహానికి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు బి.బాల అంకిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణాన్ని పరిరక్షించాలి

ప్రొద్దుటూరు కల్చరల్ : ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి పేర్కొన్నారు. స్థానిక భగత్‌సింగ్ కాలనీలోని ఈద్గా మైదానంలో అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ ఆధ్వర్యంలో 150 మొక్కలను నాటారు. ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటి వాటి పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అంజుమన్ అహలె ఇస్లాం కమిటీ అధ్యక్షుడు వీఎస్ ముక్తియార్, ప్రధాన కార్యదర్శి ఇలియాస్, ఉపాధ్యక్షులు మహమూద్, మాజీ అధ్యక్షులు బాషా పాల్గొన్నారు.

యూరియా కొరత.. అన్నదాత కలత!

- రైతులకు అందని యూరియా
- ఎరువులు వేయకుండానే వరి నాట్లు పూర్తి
- ఆందోళనలో కర్షకులు



ప్రొద్దుటూరు రూరల్ : యూరియా కొరత లేదు.. యూరియా తప్పకుండా వస్తుంది. యూరియా కోసం రైతులు బెంగపెట్టుకోవద్దు, ఇబ్బందులు పడవద్దు, రైతులకు కావాల్సినంత యూరియా త్వరలో ఆర్ఎస్‌కేలకు, డిస్ట్రిబ్యూటర్లకు వస్తుంది. ఇది వ్యవసాయశాఖ అధికారులు ప్రతి రోజు పత్రికలకు ఇచ్చే ప్రకటనలు. యూరియా కోసం రైతులు నిత్యం ఎరువుల దుకాణాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఒక బస్తా కానీ రెండు బస్తాలు కానీ యూరియా ఇస్తే వరినాట్లు పూర్తి చేసుకుంటామని రైతులు అధికారులను, ఎరువుల దుకాణాదారులను వేడుకుంటున్నారు.

యూరియా దొరకకపోవడంతో..

సకాలంలో యూరియా అందకపోవడంతో కొంత మంది రైతులు దుక్కిలో ఎరువులు వేయకుండానే వరినాట్లు పూర్తి చేశారు. యూరియా దొరకక డీఏపీ ఎరువులను వాడలేక వరినాట్లను పూర్తి చేసుకుంటున్నారు. డీఏపీలో యూరియా కల్తీ చేయకుంటే వరి నాట్లు బాగుండవనేది రైతుల అభిప్రాయం. దీంతో యూరియా దొరికినప్పుడు దుక్కిలో ఎరువులు చల్లవచ్చుననే ఆలోచనతో ఎరువులు వేయకుండానే వరి నాట్లు పూర్తి చేశారు. దీని వల్ల వరినాట్లు పచ్చబడకుండా వేసిన నాట్లు వేసినట్లుగా ఉంటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అధిక ధరకు విక్రయం

పట్టణంలోని పలు ఎరువుల దుకాణాదారులు ఇతర జిల్లాల నుంచి యూరియాను తెప్పించి బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. యూరియా బస్తా రూ.267 అమ్మాల్సి ఉండగా రూ.350 నుంచి రూ.400 వరకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నాడు. యూరియా కావాలంటే డీఏపీ, సూక్ష్మ పోషకాలు తీసుకోవాలని రైతులపై ఒత్తిడి చేస్తున్నారు. హోల్ సేల్ సరుకును రీటైల్ దుకాణాల్లో, రీటైల్ సరుకును హోల్‌సేల్ గోడౌన్లలో, అనధికారిక గోడౌన్లలో సరుకులు దాచి వ్యవసాయ శాఖ అధికారుల కళ్లు గప్పి ఎరువులను అధికరేట్లకు విక్రయిస్తున్నారని రైతులు చెబుతున్నారు. ప్రొద్దుటూరులో ఎరువుల అక్రమ దందా జోరుగా సాగుతున్నా.. అధికారులు అప్పుడప్పుడు ఎరువుల దుకాణాలపై దాడులు చేసి రికార్డుల పరిశీలన, నిల్వల లెక్కలు చూసి మమ అనిపిస్తున్నారే తప్పా.. చర్యలు తీసుకోవడంలో విఫలమయ్యారని పలువురు విమర్శిస్తున్నారు.

నేటి నుంచి పంపిణీ చేస్తాం

ఆర్ఎస్‌కే కేంద్రాల్లో రైతులకు సోమవారం నుంచి యూరియా పంపిణీ చేస్తాం. ప్రస్తుతం వరి రైతులకు మాత్రమే పంపిణీ చేయాలని సిబ్బందికి సూచించాం. యూరియా పంటలకు తక్కువ మోతాదు వాడుకుంటే మంచింది. ఎవరు నిల్వ ఉంచుకోవాల్సిన అవసరం లేదు. వ్యాపారులు అధిక రేట్లకు విక్రయించినా, అనధికారంగా నిల్వ చేసినా చర్యలు తీసుకుంటాం.

- ఏడీఏ అనిత, ప్రొద్దుటూరు

ఎరువులు వేయకుండానే నాట్లు వేశా



వారం రోజులుగా యూరియా కోసం అంగళ్ల చుట్టు తిరిగాను. ఎక్కడా దొరక్కపోవడంతో దుక్కిలో ఎరువులు వేయకుండానే వరి నాట్లు వేశా. ఆరున్నర ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి పంటను సాగు చేశా.

- దానం, కౌలు రైతు, చెంచుపల్లె గ్రామం, చాపాడు మండలం

ప్రభుత్వ వైద్య కళాశాలు, ఆరోగ్యశ్రీ నిర్వీర్యం

- పేదలకు తీరని ద్రోహం చేస్తున్న సీఎం చంద్రబాబు
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి



అట్లూరు : ప్రభుత్వ వైద్య కళాశాలలతోపాటు ఆరోగ్య శ్రీ పథకాన్ని సీఎం చంద్రబాబు నాయుడు నిర్వీర్యం చేసి పేద ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి విమర్శించారు. పోరుమామిళ్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వైఎస్ జగన్ ప్రభుత్వంలో రూ.8,500 కోట్ల ఖర్చుతో 17 ప్రభుత్వ వైద్య కళాశాలల ఏర్పాటుకు శ్రీకారం చుట్టారన్నారు. వీటిలో ఐదు కాలేజీలు ఇప్పటికే ప్రారంభమవగా.. ఐదు కాలేజీలు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. నిర్మాణాలు పూర్తయిన మెడికల్ కాలేజీలను ప్రైవేకరణ పేరుతో చంద్రబాబు ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని దుయ్యబట్టారు. డాక్టర్ వైఎస్ రాజశేఖర రెడ్డి రూపొందించి, అమలు చేసిన ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రజలకు దూరం చేసేందుకు కూటమి సర్కార్ కయుక్తులు పన్నుతోందన్నారు. వైఎస్ జగన్ ప్రభుత్వంలో ఆరోగ్యశ్రీలో 3257 వ్యాధులకు చికిత్స అందిందని, రూ.25లక్షల వరకు ఉచితంగా చికిత్స చేయించుకునే అవకాశం పేద కుటుంబాలకు కలిగిందని పేర్కొన్నారు. కూటమి సర్కార్‌లో ఆరోగ్యశ్రీ పథకం నిర్వీర్యమైందని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా రూ.3,600 కోట్లు ఏడాదికి ఖర్చు చేస్తూ ఆరోగ్యశ్రీ పథకాన్ని అద్భుతంగా అమలు చేశారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కచ్చితంగా ప్రైవేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేసి ప్రభుత్వ రంగంలోనే మెడికల్ కాలేజీలు కొనసాగేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

ప్రొద్దుటూరు జిల్లాకు సహకరించాలి

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు జిల్లా సాధన సమితి జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డిని కలిసి ప్రొద్దుటూరు జిల్లాగా చేయుటకు సహకరించాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ జిల్లాల రీ ఆర్గనైజేషన్ కమిటీ త్వరలో జిల్లాల పర్యటనలకు వస్తారని, అప్పుడు వారిని కలిసి వినతి పత్రం తప్పక ఇస్తానని తెలిపారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళుతానని చెప్పారు. ఇందుకు జేఏసీ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు జిల్లా సాధన జేఏసీ కన్వీనర్లు డాక్టర్ నాగదస్తగిరిరెడ్డి, న్యాయవాది సీవీ సురేష్, వంకదార వీరభద్రయ్య, డాక్టర్ వరుణ్‌కుమార్‌రెడ్డి, బొర్రా రామాంజనేయులు, ఎస్ఆర్‌బీ జనార్దన్‌రెడ్డి, ధరంకారీ భాస్కర్‌రావు, ఎన్జీఓ అసోసియేషన్ తాలూకా అధ్యక్షుడు కేజే రఘురామిరెడ్డి, ఎండీ అయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం జేఏసీ కమిటీ సభ్యులు విశ్వహిందూ పరిషత్ సభ్యులను, బంగారు వ్యాపార సంఘం అధ్యక్షుడు కొప్పర్తి మధు, ఆర్యవైశ్యసభ అధ్యక్షుడు బుశెట్టి రామ్మోహన్‌లను కలిసి ప్రొద్దుటూరు జిల్లా సాధనకు మద్దతు ఇవ్వాలని కోరారు.

ఎయిడెడ్ పాఠశాలల్లో అవినీతిని అరికట్టాలి



మాట్లాడుతున్న పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కర్వీనర్ ఓబులేసు

ప్రొద్దుటూరు : ఉమ్మడి కడప జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్సీఎం డయాసిస్ ఎయిడెడ్ పాఠశాలల్లో జరుగుతున్న అవినీతి అక్రమాలను అరికట్టాలని పీఎస్‌వైఎఫ్ రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు, టీఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయరాజు కోరారు. ఆదివారం ప్రొద్దుటూరులో వారు మాట్లాడుతూ మైదుకూరు మండలంలో కరుణగిరి, పోరుమామిళ్ల, కడప మరియాపురం, బ్రహ్మంగారిమఠం, రామాపురం ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలల్లో 26 ఉపాధ్యాయుల పోస్టులను ఎటువంటి రోస్టర్ పాయింట్లు లేకుండా, టెట్ క్వాలిఫై కానీ వారిని నియమించారన్నారు. ఒక్కొక్కరి వద్ద రూ.15లక్షల నుండి రూ.25 లక్షల వరకు ఆర్సీఎం డీజీఎం వసూలు చేశారని, అందుకు జిల్లా డీఈఓలు, డిప్యూటీ డీఈఓలు సహకరించారని ఆరోపించారు. పాఠశాలల్లో పనిచేస్తున్న సీనియర్ ఉపాధ్యాయులను తొలగించి అక్రమ పద్ధతిలో ఎయిడెడ్ పోస్టులను భర్తీ చేసి రూ.లక్షలు దండుకుంటున్నారని అన్నారు. ఆర్సీఎం ఎయిడెడ్ పాఠశాలల్లో ఉపాధ్యాయ పోస్టుల్లో అక్రమాలకు పాల్పడిన వారిపై, అందుకు సహకరించిన ఆర్జేడీ, డీఈఓ, డిప్యూటీ డీఈఓలపై జిల్లా కలెక్టర్ విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో పీఎస్‌వైఎఫ్ నాయకుడు బయన్న పాల్గొన్నారు.

ముగిసిన సూపర్ సెవెన్ క్రికెట్ పోటీలు



సూపర్ సెవెన్ క్రికెట్ పోటీల్లో విజేతగా నిలిచిన కడప జిల్లా జట్టు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో ఆంధ్రప్రదేశ్ సూపర్ సెవెన్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అండర్ 23 మెన్ యూత్ క్రికెట్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 11 జట్లు తలపడగా విజేతగా కడప, రన్నరప్‌గా ఎన్టీఆర్ జిల్లా, తృతీయ స్థానంలో నంద్యాల జిల్లా నిలిచాయి. ఈ సందర్భంగా యూత్ క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు మార్తల సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ క్రీడాకారులు నిత్యం క్రీడా సాధన చేసి జాతీయ స్థాయి క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలని ఆకాంక్షించారు. విజేతలకు ట్రోఫి, మెడల్స్, సర్టిఫికెట్లను అందించారు. మొదటి నాలుగు జట్లలో ప్రతిభకనబరిచిన క్రీడాకారులు త్వరలో జార్ఖండ్‌లో జరిగే సూపర్ సెవెన్ జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొంటారని సూపర్ సెవెన్ క్రికెట్ అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ నరేష్‌రెడ్డి తెలిపారు.

మాలలపై దాడి చేయడం దారుణం



మాట్లాడుతున్న రామాజీ ఇమ్మానుయేల్

ప్రొద్దుటూరు కల్చరల్ : ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గంలో జనసేన పార్టీ నాయకులు మాలలపై దాడి చేయడం దారుణమని రాష్ట్ర మాలమహానాడు రామాజీ వర్గం జాతీయ అధ్యక్షుడు రామాజీ ఇమ్మానుయేల్ తెలిపారు. మాలలపై జరిగిన దాడికి వ్యతిరేకంగా స్థానిక పాత బస్టాండ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి శాంతి భద్రతలు క్షీణించాయని, బడుగు బలహీన వర్గాలపై దాడులు పెరిగిపోతున్నాయన్నారు. రాష్ట్రంలో ఎరువుల కొరత కొరత తీవ్రంగా ఉండటంతో దీనిపై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్న నేపథ్యంలో దానిని పక్కదారి పట్టించేందుకు అభం శుభం తెలియని దళితులపై దాడులు చేయడం సిగ్గుచేటన్నారు. హోం మంత్రి స్పందించి మాలలపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని, లేకుంటే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మాలమహానాడు రామాజీ వర్గం రాష్ట్ర సమన్వయకర్త మేకల ఓబులేసు, రాయలసీమ జాయింట్ సెక్రటరీ అరుణ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు సంగటి పుల్లయ్య, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షుడు నారాయణ, గాలిపోతుల శేఖర్, రత్నం, సుధాకర్ పాల్గొన్నారు.

దళితులపైన దాడులు అరికట్టాలి



నిరసన వ్యక్తం చేస్తున్న దళిత సంఘాల నేతలు

బ్రహ్మంగారిమఠం : రాష్ట్రంలో ఎన్ని చట్టాలు తెచ్చిన దళితుల పట్ల దాడులు అరికట్టలేకపోతున్నారని దళిత సంఘాల జేఏసీ నియోజకవర్గ అధ్యక్షులు మూరతోటి ఒలీవర్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘ నాయకులతో కలిసి నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని చట్టాలు తెచ్చినా దళితులపై దాడులు ఆగడం లేదన్నారు. ఎక్కడ చూసినా దళితుల భూములు ఆక్రమణలకు గురవుతున్నాయన్నారు. ఇటీవల మైదుకూరులో దళితులపై దాడి, బద్వేల్‌లో దళితుల భూములు అగ్రకులాల వారు ఆక్రమణ చేశారని, వారికి తగు న్యాయం చేయాలని ఆర్డీఓను దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. దళితులపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు చర్యలు చేపట్టకుంటే ఆందోళన కార్యక్రమాలు తప్పవని హెచ్చరించారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం దళితులకు ఇచ్చిన భూములను గుర్తించి వారికి అప్పజెప్పాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ ప్రధాన కార్యదర్శి నాగిపోగు, చెన్నయ్య దళిత సంఘం నాయకులు నాయకులతో కలిసి పెద్ద ఎత్తున అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనను తెలియజేశారు. కార్యక్రమంలో చలపతి, యస్ఆర్ కృష్ణ సుభాస్, ఓబయ్య ప్రసాద్ పుల్లయ్య, యువకులు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక



గురువులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

కలసపాడు : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1989–90 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. ఒకరినొకరు ఆనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పూర్వ విద్యార్థులు తమకు పాఠాలు నేర్పిన గురువులు కొండయ్య, పుల్లారెడ్డి, లక్ష్మీనారాయణ, యేసుదాసు, పద్మనాభరావు, ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎస్.వి.రమణయ్య, పాఠశాల స్థలదాత రమాదేవిలను సన్మానించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు పాఠశాలకు రూ.72 వేలు విలువ చేస్తే కంప్యూటర్, ప్రింటర్, వాటర్ కూలర్ వితరణ చేశారు. పూర్వ విద్యార్థులు పురుషోత్తంరెడ్డి, శేఖర్‌బాబు, కడపరమణారెడ్డి సుబ్బరాయుడు, బాలవెంకటరెడ్డి, బి.ఎస్.వి.ప్రసాద్, జయన్న, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కూటమికి రైతులంటే చులకన భావం

- నిద్రపోతున్న కూటమి ప్రభుత్వాన్ని ముళ్ల కర్రతో కొట్టి లేపుదాం
- యూరియా బ్లాక్ మార్కెట్‌పై 9న 'అన్నదాత పోరు'భారీ ర్యాలీ
- విజయవంతం చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పిలుపు



అన్నదాత పోరు కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు


మైదుకూరు : వ్యవసాయం దండగని చెప్పే చంద్రబాబుకు మొదటి నుంచి రైతులంటే చులకన భావం ఉందని మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆరోపించారు. ఆదివారం మైదుకూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎరువుల బ్లాక్ మార్కెట్‌పై అన్నదాత పోరు పేరుతో ఈనెల 9న వైఎస్సార్‌సీపీ నిర్వహించనున్న భారీ ర్యాలీ కార్యక్రమ కరపత్రాలను పార్టీ నాయకులతో కలసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా రఘురామిరెడ్డి మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ హయాంలో రైతులకు ఏ సమస్య వచ్చినా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వెంటనే స్పందిస్తూ ఆదుకుంటూ వచ్చారని పేర్కొన్నారు. ఏడాదికి రూ.13,500తో ఐదేళ్లపాటు రైతు భరోసా ఇచ్చి రైతులను ఆదుకున్నారని కొనియాడారు. పంటలు ఖరీఫ్‌లో దెబ్బతింటే రబీలోనే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చారన్నారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రైతులకు పంటల బీమాను వర్తింపజేశారన్నారు. రైతు భరోసా కింద నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో రూ.184.88 కోట్లు, ఇన్‌పుట్ సబ్సిడీ కింద రూ.117.49 కోట్లు, పంటల బీమా కింద రూ.3.22 కోట్లు జగన్ ప్రభుత్వంలో నియోజవకర్గంలోని రైతులకు ఇచ్చినట్లు వివరించారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు కేంద్రం ఇచ్చే వాటా కాకుండా రైతులకు అన్నదాత సుఖీభవ కింద రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. అయితే కేవలం రూ.5వేలు మాత్రమే ఇచ్చారని అదీ అరకొరగా ఇచ్చారని, చాలా మంది రైతులకు అందలేదని విమర్శించారు. ఇన్‌పుట్ సబ్సిడీ లేదు.. పంటల బీమా లేదు.. ఏమి ఇవ్వని కూటమి ప్రభుత్వం రైతులు డబ్బులు పెట్టి కొంటామని చెబుతున్న యూరియాను అందుబాటులో లేకుండా చేస్తోందని మండిపడ్డారు. యూరియా కోసం కిలోమీటర్ల మేర రైతులు క్యూలో నిలుచున్నారని కూటమి ప్రభుత్వం అనుకూల పత్రికల్లోనే వస్తున్నాయన్నారు. ఇవి ప్రభుత్వానికి కనిపించలేదా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో యూరియా దొరకడం లేదని ఒక్క రైతు కూడా చెప్పలేదన్నారు. యూరియా కోసం రైతులు క్యూలో నిలబడితే లంచ్ బఫే కోసం నిలబడ్డారని మంత్రి అచ్చన్నాయుడు చులకనగా మాట్లాడటం శోచనీయమన్నారు. చంద్రబాబు ఒక అడుగు ముందుకేసి అసలు వరే సాగు చేయొద్దని అంటుండటం సిగ్గు చేటన్నారు. వరి వేయకపోతే ప్రజలంతా ఏమి తింటారు ఆహార కొరత రాదా అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కారం కావాలంటే రైతులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వాన్ని ముళ్ల కర్రతో పొడిచి కళ్లు తెరిచేలా చేయాలన్నారు. ప్రభుత్వానికి తమ వ్యతిరేకతను తెలియజేయాలని, శాంతియుతంగా ర్యాలీలు నిర్వహించాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపు మేరకు ర్యాలీలు నిర్వహించి అధికారులకు వినతి పత్రాలు అందజేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో వ్యవసాయ శాఖ ప్రభుత్వ మాజీ సలహాదారుడు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, నేట్లపల్లి శివరాం, ఏపీ సుబ్బారెడ్డి, ఊటుకూరు రఘురామిరెడ్డి, మదీనా దస్తగిరి, గల్లా నరసింహారెడ్డి, ఎంపీపీ లక్ష్మయ్య, పట్టణ అధ్యక్షుడు కేపీ లింగన్న, రైతు విభాగం నియోకజవకర్గ ధ్యక్షుడు జి.నాగిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, రాఘవరెడ్డి, కిరణ్మయి, బండి నాగేంద్ర ప్రసాద్, ఓబుళరెడ్డి, తవ్వా వెంకటయ్య, చొక్కం సంజీవరాయుడు, రవిశంకర్‌రెడ్డి, ఇరగంరెడ్డి గోపాల్ రెడ్డి, ఎంఎస్ఆర్ చిన్నా, కౌన్సిలర్ వెంకటసుబ్బన్న, వేణుగోపాల్ రెడ్డి, మాబు చాంద్, కందనూరు షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

9న మైదుకూరులో కార్యక్రమం ఇదీ..

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా 9న మైదుకూరులో రైతులతో 'అన్నదాత పోరు'పేరుతో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. స్థానిక ప్రొద్దుటూరు రోడ్డులోని మూలబాట వీధి వద్ద ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఉదయం 9 గంటలకు మాజీ ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహిస్తారు. అక్కడి నుంచి 10 గంటలకు ర్యాలీ ప్రారంభమై రాయల కూడలి మీదుగా కడప రోడ్డులోని వ్యవసాయ కార్యాలయం వరకు కొనసాగుతుంది. ఎరువుల బ్లాక్ మార్కెట్‌ను అరికట్టాలని, రైతులకు యూరియాను సమృద్ధిగా అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ కార్యాలయంలో వ్యవసాయ ఏడీఏకి వినతి పత్రం అందజేస్తారు.



నేడు అంతర్జాతీయ ఫిజియోథెరపీ దినోత్సవం



వేంపల్లె: ఫిజియోథెరపీకి సుదీర్ఘ చరిత్ర ఉంది. అయితే ఆధునిక రూపం మొదటి ప్రపంచ యుద్ధం తర్వాత పుట్టింది. అప్పుడు గాయాలైన సైనికులను పునరావాసం కల్పించడానికి, వారి కదలికలను పునరుద్ధరించడానికి 'ఫిజికల్ థెరపీ' లేదా 'జిమ్నాస్టిక్స్' అని పిలిచే వ్యాయామాలు ఉపయోగించారు. తర్వాత 'ఫిజియోథెరపీ'అనే పేరు స్థిరపడింది.

పురాతన కాలం నుంచి ప్రారంభం

గాయం, వ్యాధుల కారణంగా కదలికలు కోల్పోయిన వారికి శారీరక వ్యాయామాల ద్వారా సహాయం చేసే పద్ధతి చాలా కాలం క్రితం నుంచి ఉంది. ప్రాచీన నాగరికతలో కూడా కదలికలను మెరుగుపరచడానికి వ్యాయామాలను ఉపయోగించినట్లు ఆధారాలు ఉన్నాయి.

ఫిజియోథెరపీ రంగం అభివృద్ధి

అమెరికాలో 1917లో 'ఫిజికల్ థెరపిస్టుల'కు ఒక సంస్థ స్థాపించబడింది. అనేకమంది పరిశోధకులు, వైద్య నిపుణుల కృషి వల్ల ఫిజియోథెరపీ రంగం బాగా అభివృద్ధి చెందింది. ఇటీవలి కాలంలో, ఫిజియోథెరపీ ప్రపంచంలోని మూడవ అతిపెద్ద ఆరోగ్య సంరక్షణ వృత్తిగా మారింది. పులివెందులలో బాలాజీ ఫిజియోథెరపీ క్లినిక్, లైఫ్ కేర్ ఫిజియో క్లినిక్,సుధీర్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ క్లినిక్, రిలీవ్ ఫిజియోథెరపీ, రిహాబిలిటేషన్ క్లినిక్ వేంపల్లిలో శ్రీ హరి ఫిజియోథెరపి క్లినిక్, రిహెబిలిటేషన్ సెంటర్ ఇంకా కొన్ని క్లినిక్‌లు ప్రజలకు అందుబాటులో ఉన్నాయి.